

అనుదినం.. జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
08 పేజీలు | ఆదివారం 03 డిసెంబర్ 2023 | www.navatelangana.com

నేడే కౌంటింగ్
- అభ్యర్థుల్లో అయోమయం
- అనుచర వర్గాల్లో టెన్షన్
- జోరుగా బెట్టింగులు
- అభ్యర్థుల భవిష్యత్తు ఈవీఎంలలో



8లో...

తాగటం.. పడటం..
- మద్యం ప్రియులకు పరిపాటిగా మారిన వైనం
- వైన్స్‌ల వద్ద నిబంధనలు పాటించని యజమానులు
- పట్టించుకోని ఆబ్కారీ అధికారులు



8లో...

అందరి చూపు కామారెడ్డి వైపు..

కామారెడ్డి అభ్యర్థి గెలుపుపై తీవ్ర ఉత్కంఠ.. పలు చోట్ల బెట్టింగ్‌ల జోరు

రాష్ట్రంలోని అందరి చూపు.. కామారెడ్డి వైపు పడింది. ఇక్కడి నుంచి ఉద్దండులు పోటీలో ఉండటంతో ప్రజలు ఏ నలుగురు ఒకచోట చేరినా.. 'కామారెడ్డిలో ఎమ్మెల్యేగా ఎవరు గెలుస్తారో?' అనే చర్చ నడుస్తోంది. దీంతో పాటు ఈ నియోజకవర్గ అభ్యర్థి గెలుపోటములపై జోరుగా బెట్టింగ్‌లు సైతం నడుస్తున్నాయి. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ప్రస్తుత ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, కాంగ్రెస్ పార్టీ నుంచి టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి పోటీ చేయటంతో తెలుగు రాష్ట్రాల ప్రజల చూపు కామారెడ్డిపై పడింది.


కామారెడ్డి ముఖచిత్రం

నవతెలంగాణ-కామారెడ్డి

2లో...

సెకండ్ ర్యాండమైజేషన్ పూర్తి

- ఎన్నికల పరిశీలకుల సమక్షంలో..

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

శాసనసభ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఏర్పాట్లలో భాగంగా శనివారం కౌంటింగ్ సిబ్బంది రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను ఎన్నికల పరిశీలకుల సమక్షంలో పూర్తి చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు నేతృత్వంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఎన్.ఐ.సి హాల్‌లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ సెకండ్ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ పూర్తయిన మీదట కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఈ.వీ.ఎంలను ఓట్ల లెక్కింపు కోసం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలకు తరలించి సాయుధ బలగాల పహారా నడుమ స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపర్చారు. ఆదివారం ఉదయం నుంచి ప్రారంభమయ్యే ఓట్ల లెక్కింపు కోసం కౌంటింగ్ సిబ్బంది రెండవ విడత రాండమైజేషన్ ప్రక్రియను పరిశీలకుల సమక్షంలో నిర్వహించారు. ఆరు సెగ్మెంట్లకు సంబంధించి మొత్తం 122 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 131 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 123 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని, వీరికి ఇప్పటికే పలు విడతలుగా మాస్టర్ ట్రైనర్స్ చే కౌంటింగ్ నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించినట్టు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పరిశీలకుల దృష్టికి తెచ్చారు. మిగతా 2లో...


మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

20 రోజులుగా తాగునీటికి ఇబ్బంది పడుతున్న తండావాసులు



నవతెలంగాణ-భీంగల్

మండలంలోని సంతోష్‌నగర్ గ్రామపంచాయతీ కార్యాలయం ముందు తండా మహిళలు ఖాళీ బిందెలతో శనివారం నిరసన చేపట్టారు. గత 20రోజులుగా తండాలో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఈ విషయమై గ్రామ సర్పంచ్, పంచాయతీ అధికారికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని వారు తెలిపారు. తండాలో గల చెడిపోయిన బోరుకు మరమ్మతులు చేయించాలని కోరగా.. అది తమ పరిధిలోకి రాదని కాలయాపన చేస్తున్నారని మహిళలు సర్పంచ్, పంచాయతీ అధికారుల తీరుపై మండిపడ్డారు

కుల సంఘాల ఓట్లే కీలకం

- అవి ఎటుపడితే వారిదే గెలుపు
- గ్రామాల వారీగా గెలుపోటములపై అభ్యర్థుల అంచనాలు
- ఎవరి ధీమాలో వారే
- నేడు తేలనున్న భవితవ్యం



జుక్కల్ ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో త్రిముఖ పోటీ అనివార్యమైనట్లు జుక్కల్ నియోజకవర్గ ప్రజల్లో జోరుగా చర్చ నడుస్తోంది. గెలుపోటములపై మూడు పార్టీల అభ్యర్థులు, నాయకులు అంచనా వేయలేని పరిస్థితి నెలకొంది. అయితే ఈ నియోజకవర్గంలో పోటీ చేసిన అభ్యర్థులకు కుల సంఘాల ఓట్లే కీలకం కానున్నాయి. కుల సంఘాల ఓట్లు ఎవరికి పడితే వారిదే గెలుపు అనేది స్పష్టమవుతోంది. అయితే గ్రామాల వారీగా గెలుపోటములపై అభ్యర్థులు అంచనాల్లో నిమగ్నమయ్యారు. అయితే తమదే గెలుపని ఒకరు.. మేమే గెలుస్తామని ఇంకొకరు ఇలా.. ఎవరి ధీమాలో వారు నిమగ్నమయ్యారు. ఏదేమైనా గెలుపు ఎవరిదో భవితవ్యం నేడు తేలనుంది.

నవతెలంగాణ-మద్నూర్

7లో...

సెకండ్ ర్యాండమైజేషన్ పూర్తి

-మొదటిపేజీ తరువాయి

రిజర్వు సిబ్బంది సైతం అందుబాటులో ఉంటారని అన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా ప్రతి నియోజకవర్గానికి ఓట్ల లెక్కింపుకై 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేస్తూ, రౌండ్ల వారీగా కౌంటింగ్ నిర్వహించేలా పకడ్బందీ చర్యలు తీసుకున్నామని అన్నారు. ఆర్మూర్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు 16 రౌండ్లలో, బోధన్ 18 రౌండ్లలో, బాన్సువాడ 19 రౌండ్లు, నిజామాబాద్ అర్బన్ 21 రౌండ్లు, నిజామాబాద్ రూరల్ 21 రౌండ్లు, బాల్కొండ నియోజకవర్గ ఓట్లను 18 రౌండ్లలో లెక్కించడం జరుగుతుందని వివరించారు. కాగా, మూడవ విడత కౌంటింగ్ సిబ్బంది రాండమైజేషన్ ప్రక్రియ ఆదివారం ఉదయం 5.00 గంటలకు రిటర్నింగ్ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తారని కలెక్టర్ తెలిపారు. ఆ జాబితాను అనుసరిస్తూ కౌంటింగ్ సిబ్బందిని ఆయా టేబుళ్లకు ఓట్ల లెక్కింపు కోసం కేటాయిస్తారని వివరించారు. ఈ సందర్భంగా మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజెషన్ ప్రక్రియను కూడా పూర్తి చేశారు. అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, సీపీఓ బాబూరావు, ఎన్ఐసి అధికారి రవికుమార్, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

గ్రంథాలయ పన్ను చెల్లించాలని సర్పంచులకు వినతి



వినతినిస్తున్న గ్రంథాలయ పాలకులు

నవతెలంగాణ-లింగంపేట్

గ్రంథాలయ పన్నులు చెల్లించాలని అందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని లింగంపేట్ మండల గ్రంథాలయ పాలకులు పెద్ద బూరి శ్రీనివాస్ తెలిపారు. శనివారం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ బొల్లు లావణ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. మండలంలో 41 గ్రామ పంచాయతీల పరిధిలో 2019 నుంచి 2023 వరకు నాలుగు సంవత్సరాల గ్రంథాలయ పన్ను బకాయి ఉందని పన్ను చెల్లించి సహకరించాలన్నారు. పలుసార్లు ప్రజాప్రతినిధులకు, కార్యదర్శులకు వినతిపత్రాలు సమర్పించినా ఇప్పటివరకు పన్నులు చెల్లించలేదన్నారు. గ్రంథాలయ పనులు చెల్లించి గ్రంథాలయ అభివృద్ధికి, పాఠకులకు మెరుగైన పాఠ్యపుస్తకాలు వసతులు కల్పించేందుకు ఎంతో దోదపడుతుందన్నారు. గ్రంథాలయంలో నిరుద్యోగ యువతీ యువతల కోసం పోటీ పరీక్షల కోసం పాఠ్యపుస్తకాలను అందుబాటులో ఉంచామని మరికొన్ని పాఠ్య పుస్తకాలు గ్రంథాలయంలో వసతులు కల్పించేందుకు ప్రజా ప్రతినిధుల సహకారం ఎంతో అవసరమన్నారు. గ్రంథాలయ పన్నులు జిల్లా గ్రంథాలయ అధికారికి చెల్లించాలని ఆయన ఇచ్చిన వినతిపత్రంలో కోరారు.

ఆటలతో మానసికోల్లాసం



క్రికెట్ కిట్టును అందజేస్తున్న వైస్ ఎంపీపీ

నవతెలంగాణ-కామారెడ్డి

ఆటలు ఆడడం వల్ల మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని కామారెడ్డి మండల వైస్ ఎంపీపీ ఉరుదొండ నరేష్ కుమార్ అన్నారు. శనివారం తిమ్మక్‌పల్లి గ్రామంలో యూత్ సభ్యులకు క్రికెట్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువకులు ఆటలు ఆడటం వల్ల శరీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం, జీవితంలో ఏదైనా సాధించవచ్చునని నమ్మకం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జ్ఞానేశ్వర్, ఉపసర్పంచ్ ప్రశాంత్, యూత్ సభ్యులు నగేష్, సందీప్, శేఖర్, దశరథ్, మణికంఠ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 144 సెక్షన్ అమలు

- నిజామాబాద్ సీపీ కల్మేశ్వర్, కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ వెల్లడి

నవతెలంగాణ-కంఠేశ్వర్/కామారెడ్డి

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆదివారం 144 సెక్షన్ అమలులో ఉంటుందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ వెల్లడించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల లెక్కింపు నేపథ్యంలో ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఓట్ల లెక్కింపు కేంద్రాలైన నిజామాబాద్ పట్టణంలోని గర్ల్స్ పాలిటెక్నిక్ కళాశాల, బాయ్స్ పాలిటెక్నిక్ కళాశాల పరిసర ప్రాంతాల్లో నేడు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని సీపీ కల్మేశ్వర్ తెలిపారు. ఆదివారం ఉదయం 6గంటల నుంచి సోమవారం ఉదయం 6గంటల వరకు అమలులో ఉంటుందని, ఈ సమయంలో ఒక కిలోమీటర్ దూరం వరకు 5 మంది కంటే ఎక్కువ వ్యక్తులు గుమిగూడి ఉండటం నిషేధించినట్టు పేర్కొన్నారు.

కామారెడ్డి : ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఆదివారం ఉదయం 6 నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని కామారెడ్డి జిల్లా ఎస్పీ సింధు శర్మ తెలిపారు. కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెలా భద్రత, సెంట్రల్ ఫోర్సెస్, జిల్లా పోలీసులతో పటిష్టమైన బందోబస్తు, సిసి కెమెరాలతో పర్యవేక్షణ ఉంటుందని వివరించారు. నలుగురు కంటే ఎక్కువ మంది గుమిగూడి ఉండవద్దని, కౌంటింగ్ సందర్భంగా రోడ్లపై ర్యాలీలు, టాపకాయలు కాల్చడం, ఊరేగింపులు నిషేధించినట్టు పేర్కొన్నారు.

ట్రాఫిక్ డైవర్షన్, పార్కింగ్ ప్రదేశాలు..

ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గుమాస్తా కాలనీ చౌరస్తా నుండి అట్లూరు క్రాస్ రోడ్డు వరకు ఎలాంటి వాహనాలు అనుమతించబడవని తెలిపారు. కావున వేరే మార్గాల ద్వారా గమ్య స్థానాలు చేరుకోవాలని సూచించారు. జుక్కల్ నియోజకవర్గ ఏజెంట్లు వారి వాహనాలను అడ్లూరు రోడ్‌లోని బ్రిడ్జ్ దగ్గర గల హనుమాన్ టెంపుల్ వద్ద నిర్దేశింపబడిన ప్రదేశంలో పార్కింగ్ చేసుకోవాలని వివరించారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గ ఏజెంట్లు తమ వాహనాలను గుమాస్తా కాలనీ నుండి కలెక్టరేట్ రోడ్డులోకి ప్రవేశం అవగానే అక్కడ గల కాల భైరవ టెంపుల్ ఎదురుగా ప్రక్కన వెంచర్‌లో నిర్దేశింపబడిన ప్రదేశంలో పార్కింగ్ చేసుకోవాలని తెలిపారు. పోటీ చేస్తున్న అభ్యర్థులు, మీడియా మిత్రులు తమకు సంబంధించిన వాహనాలను కౌంటింగ్ సెంటర్‌కు ఎదురుగా గల రోడ్డు పక్కన ఉన్న వెంచర్‌లో పార్కింగ్ చేసుకోవాలని, దీనిలో పోటీ చేస్తున్న అభ్యర్థి వాహన చోదకుడికి మాత్రమే లోపలికి అనుమతి కలదని తెలిపారు. కౌంటింగ్ నిమిత్తం వచ్చు సిబ్బంది, ఏజెంట్లు, పోటీ చేయుచున్న అభ్యర్థులు ఎవరికి కూడా సెల్ ఫోన్లు లోనికి అనుమతించబడవని పేర్కొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



సత్తయ్య మృతదేహం



రామ్‌రెడ్డి (ఫైల్)

నవతెలంగాణ-తాడ్వాయి

తాడ్వాయి మండలంలో శుక్రవారం రాత్రి, శనివారం జరిగిన వేరువేరు రోడ్డు ప్రమాదాలలో ఇద్దరు మృతి చెందినట్లు తాడ్వాయి ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. తాడ్వాయి మండలం దేవికలాన్ గ్రామానికి చెందిన కుంట రాములు అలియాస్ రామ్‌రెడ్డి (44) అనే వ్యక్తి శుక్రవారం ఉదయం కామారెడ్డిలోని బంధువుల పెళ్ళికి వెళ్ళాడు. అక్కడ పెళ్లి అనంతరం తిరిగి సాయంత్రం దేవికలాన్ గ్రామానికి బైకుపై తిరిగి వస్తుండగా తాడ్వాయి ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే చికిత్స నిమిత్తం కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అలాగే శనివారం మండలంలోని ఎర్రపహాడ్ గ్రామ శివారులో మోతే రోడ్డు సమీపంలో జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో కరీంనగర్ జిల్లా అల్మాస్పూర్ గ్రామానికి చెందిన సింగరేణి సత్తయ్య (49) అనే వ్యక్తి బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా కారు వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కరీంనగర్ జిల్లా నుంచి లింగంపేట్ మండలం నల్లమడుగులో ఉన్న బంధువుల ఇంటికి వచ్చి తిరిగి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతుడు రాములుకు భార్య సుజాత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-దోమకొండ

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన దోమకొండ మండలంలోని ముత్యంపేట గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ మురళి తెలిపిన వివరాల ప్రకారం.. దోమకొండ మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన దొందడి శ్రీకాంత్ (27) గ్రామంలో కొత్తగా ఇల్లు నిర్మాణం చేపట్టాడు. నెల క్రితం గృహప్రవేశం చేశారు. కొత్త ఇల్లు నిర్మాణం కోసం అధిక అప్పులు కావడంతో అప్పుల బాధ భరించలేక గ్రామ శివారులోని వ్యవసాయం భూమి వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య దొందడి అనిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోస్టాఫీస్ ద్వారా యాక్సిడెంట్ బెనిఫిట్ అందజేత



నవతెలంగాణ-రామారెడ్డి

రామారెడ్డి పోస్టాఫీస్ వద్ద శనివారం పోస్టాఫీస్ ప్రమాద బీమా లబ్ధిదారునికి చెక్కును పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సుస్మిత భేనర్జి అందజేశారు. రామారెడ్డి పోస్ట్ ఆఫీస్ పరిధిలోని అంతంపల్లి గ్రామానికి చెందిన వడ్ల శ్రీనివాస్ పోస్టాఫీస్‌లో రూ.399తో ప్రమాద బీమా తీసుకున్నారు. శ్రీనివాస్ ప్రమాదంలో గాయపడి, ఆసుపత్రిలో చికిత్స పొందగా, రూ.70వేలు వైద్య ఖర్చు రావడంతో, పోస్టు వారు, చేసుకున్న ప్రమాద బీమా కింద రూ.70వేల విలువగల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సుస్మిత బెనర్జీ, ఎస్‌పిఎం ఉపేందర్, సిబ్బంది రాజేందర్, సిద్దన్న, ప్రేమ్, జబ్బర్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

గాడిద పాలకు డిమాండ్



నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పలు గ్రామాల్లో గాడిద పాలను విక్రయిస్తున్నారు. 100 మిల్లీ లీటర్ల పాలకు రూ.150 ధర అని గాడిద పాలు విక్రయించే వారు తెలిపారు. ఈ పాల వలన పిల్లలకు, పెద్దలకు దగ్గు, దమ్ము ఉబ్బసం నివారించువచ్చునని వారు చెబుతున్నారు.

అందరి చూపు.. కామారెడ్డి వైపు..

-మొదటిపేజీ తరువాయి

స్థానికంగా బిజెపి అభ్యర్థి కాటిపల్లి వెంకట రమణారెడ్డి సైతం వారికి ఏమాత్రం తగ్గకుండా పోటీ ఇస్తున్నట్టు చర్చ వినిపిస్తోంది. కామారెడ్డిలో కాంగ్రెస్, బిఆర్ఎస్ కాకుండా బిజెపి మాత్రం గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని స్థానికంగా చర్చ నడుస్తున్నా.. బీఆర్ఎస్ పార్టీ తాము ప్రస్తుతం ఇస్తున్న పథకాలతోనే గెలుస్తామని నమ్మకంతో ఉంటే, కాంగ్రెస్ పార్టీ గతంలో తాము ఇచ్చిన పథకాలు పనిచేస్తాయని, బీఆర్ఎస్ తొమ్మిదేళ్ల పాలనపై ప్రజలు విసిగిపోయారని తమను గెలిపిస్తారని నమ్మకంతో ఉన్నారు. అయితే బీఆర్ఎస్, కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులకు వచ్చే ఓట్లను బీఎల్ఎఫ్ అభ్యర్థి, కార్మిక నాయకుడైన సిద్ధిరాములు చీల్చే అవకాశం ఉంది. అయితే కామారెడ్డిలో ఎవరు గెలుస్తారనేది ఎగ్జిట్ పోల్‌ను బట్టి నమ్మశక్యంగా లేదని స్థానిక ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా కామారెడ్డి నియోజకవర్గం నుంచి ఇద్దరు ఉద్దండులు పోటీలో ఉండటంతో తెలుగు రాష్ట్రాల్లో మాత్రం కామారెడ్డి పేరు జోరుగా వినిపిస్తోంది.

వికలాంగుల ఉన్నతికి అనేక చట్టాలు

● నేడు అంతర్జాతీయ వికలాంగుల సంక్షేమ దినోత్సవం

నవతెలంగాణ-ఆర్మూర్

రాజ్యాంగంలోని ఆర్టికల్ 15 ప్రకారం జాతి, మత కుల లింగ ప్రాంతా వివక్షలను నిషేధించినప్పటికీ వ్యక్తుల శారీరక వైకల్యం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించ లేరు. అంగ వైకల్య అంశాలను హక్కుల కోణంలో కాకుండా సంక్షేమం సహాయం అందించే కోణంలో పరిశీలిస్తున్నారు. విద్య, ఉద్యోగాలు, సామాజిక రాజకీయ రంగాల్లో వికలాంగులకు ఎదురవుతున్న వివక్షతను నివారించే లక్ష్యంతో 1992 సంవత్సరం నుండి డిసెంబర్ 3నుండి అంతర్జాతీయ వికలాంగుల సంక్షేమ దినోత్సవం నిర్వహిస్తున్నారు.. ఈ సందర్భంగా నవ తెలంగాణ కథనం...

1981 సంవత్సరాన్ని అంతర్జాతీయ దివ్యాంగుల సంవత్సరంగా...

1976 సంవత్సరం ఐక్యరాజ్య సమితి యుఎన్ఓ సమావేశమై 1981 సంవత్సరాన్ని అంతర్జాతీయ దివ్యాంగుల సంవత్సరంగా ప్రకటించింది.. అప్పటి నుంచి మార్చి నెల మూడవ ఆదివారం దివ్యాంగుల దినోత్సవం చేసుకునేవారు. అయితే 1992లో ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో ప్రతి సంవత్సరం డిసెంబర్ మూడో తేదీని అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంగా ప్రకటించింది.. ప్రతి ఏడాది ఐక్యరాజ్యసమితి ఒక నినాదాన్ని అందిస్తుంది ..ఈ నినాదాన్ని అన్ని దేశాల ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, సభ్య సమాజం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాలతో పాటు దివ్యాంగుల హక్కులు, అవసరాలు, అభివృద్ధికి సంబంధించి విస్తృత ప్రచారానికై కృషి చేస్తున్నాయి... ఐక్య రాజ్య సమితి దివ్యాంగుల హక్కుల ఒప్పంద తేదీ 2008 మే 3 నుంచి ప్రపంచవ్యాప్తంగా అమలులోకి వచ్చింది. ఈ ఒప్పందంపై అభివృద్ధి చెందిన దేశాల కంటే చాలా ముందుగా మన ప్రభుత్వం ఆమోదించి రాష్ట్రపతి ద్వారా ప్రకటన చేసింది. ఇప్పటి వరకు మొత్తం 175 దేశాలు ఈ ఒప్పందం అమలుకు అంగీకరించాయి.



క్రీడల్లో గెలుపొందిన బధిర పాఠశాల విద్యార్థులు

మన దేశంలోని దివ్యాంగుల చట్టం....

దివ్యాంగుల చట్టం1995 ప్రకారం ఏడు రకాల వైకల్యాలు ఉండేవి ..ఈ చట్టంలో మార్పులు చేర్పులు చేసిన కేంద్ర ప్రభుత్వం 2016 లో నూతన దివ్యాంగుల చట్టానికి ఆమోదం తెలిపింది. ఈ నూతన చట్టంలో అదనంగా 14 రకాల వైకల్యాలను చేర్చింది. అయితే ఈ చట్టం అమలుకు సెక్షన్100 ప్రకారం కేంద్రానికి సెక్షన్ 101 ప్రకారం రాష్ట్రానికి సంబంధిత అంశాల్లో తగిన ఆధారాలు కల్పించింది .చట్టంలో మొత్తం 17 అధ్యాయాలు,,102 విభాగాలు ఒక అనుబంధ ప్రణాళిక ఉన్నాయి. దివ్యాంగుల సాధికరిత, ఆత్మగౌరవ, సొంత నిర్ణయం ,స్వేచ్ఛ ,వ్యక్తిగత, స్వతంత్రత ,వివక్ష లేకుండా సమాజంలో పరిపూర్ణంగా పాల్గొనే అవకాశాలు అడ్డంకులు లేని అనుకూలత వాతావరణం మొదలగున్నవి. కల్పించింది .చట్టం ప్రకారం దివ్యాంగుల హక్కుల అమలులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అనుబంధ శాఖలు సంస్థలు ప్రభుత్వ సహాయం పొందుతున్న సంస్థలు స్వచ్ఛంద సంస్థలు కంపెనీ తదితర విభాగాలు బాధ్యులుగా తగిన చర్యలు చేపట్టాలి. చట్టంలోని 2016 సెక్షన్ 37 ఏ బి సి ప్రకారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని మంత్రిత్వ శాఖల నుంచి పేదరిక నిర్మూలన, అభివృద్ధి పథకాల్లో, వ్యవసాయ భూమి, ఇల్లు కేటాయింపుల్లో ఐదు శాతం రిజర్వేషన్, మహిళా దివ్యాంగులకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ తగిన బడ్జెట్ కేటాయించాలని చట్టం చెప్తుంది. అధ్యయనం రెండు సెక్షన్ 67 ప్రకారం ఎటువంటి వేధింపులు, హింస, కించపరచడం, దోపిడీ వంటి అమానుష క్రియలకు పాల్పడకుండా ప్రభుత్వాలు తగిన చర్యలు, పథకాలు, అవగాహన కార్యక్రమాలు ఆదేశాలు చేపట్టి దివ్యాంగులను రక్షించి ఉచిత న్యాయ సహాయం అందించాలని చట్టం పేర్కొంటుంది.

అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి



నూతన దివ్యాంగుల చట్టం మీద చాలామంది దివ్యాంగులకు అవగాహన లేదు. అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి. ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు రిజర్వేషన్లు ఇతర విషయాలు తెలియడం లేదు. ప్రభుత్వ పరంగా అవగాహన కార్యక్రమాలు చేపడితే బాగుంటుంది.

తులసి పట్వారి, సామాజిక సేవకుడు, ఆర్మూర్

ఉమ్మడి జిల్లాల్లోనూ విస్తృత సేవలో సర్వశిక్షా అభియాన్

ప్రత్యేక అవసరాలు గల పిల్లలు వికలాంగులకు అందిస్తున్న సేవలను మరింత విస్తృత పరుస్తుండడంతో జిల్లాలోని భవిత కార్యాలయాలు తోడ్పడుతున్నాయి. సర్వ శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ఆధ్వర్యంలో భవిత ప్రత్యేక అవసరాలు గల పిల్లల వనరుల కేంద్రంలో రిసోర్స్ టీచర్స్ పిల్లలకు శిక్షణ ఇస్తున్నారు.

పట్టణంలోని బధిర పాఠశాలలో...

పట్టణంలోని టీచర్స్ కాలనీలోగల చెవిటి, మూగ, బధిర ఆశ్రమ పాఠశాల యందు విద్యార్థిని విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో ముందుంటున్నారు. కొన్ని సంవత్సరాల క్రితం ఝార్ఖండ్ రాష్ట్రంలోని టాటా నగర్‌లో జరిగిన వాలీబాల్ పోటీల్లో తెలంగాణ తరపున జూనియర్ బాయ్స్ ప్రథమ స్థానంలో, జూనియర్ బాలికలు మూడవ స్థానంలో గెలుపొందారు. రాంచి ముఖ్య పట్టణంలో జరిగిన వాలీబాల్, రన్నింగ్, షార్ట్‌పుట్, జావిల్లింగ్ త్రో పోటీల్లో 8, 9 ,10 తరగతులకు చెందిన 25 మంది విద్యార్థులు పాల్గొని అత్యంత ప్రతిభను కనపబరిచారు. జిల్లా కేంద్రంలో జరిగిన దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమంలో, సైన్సు దినోత్సవ కార్యక్రమంలో ప్రశంస పత్రాలు అందుకున్నారని ప్రిన్సిపాల్ శాంతమూర్తి తెలిపారు.

యువతి అదృశ్యం

నవతెలంగాణ-రామారెడ్డి



ఓ యువతి అదృశ్యమైన ఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఘన్పూర్ తాండాకు చెందిన భూక్య శిరీష, గురువారం ఉదయం 5 గంటలకు రామారెడ్డి లో ఎన్నికల వాలంటీరుగా పనిచేయడానికి వెళుతున్నానని తల్లికి చెపి వెళ్లింది. ఆమె తిరిగి రాకపోవడంతో చుట్టుపక్క, బంధువుల ఇండ్లలో వెతికారు. దొరకకపోవడంతో తల్లి భూక్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుగుతున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

చిన్నారులకు బాలామృతం పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూర్ గ్రామ అంగన్వాడి కేంద్రంలో శనివారం చిన్నారులకు బాలామృతం పంపిణీ చేసినట్లు అంగన్వాడి సూపర్వైజర్ వెంకటరమణమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణి స్త్రీలు, చిన్న పిల్లల తల్లులు పోషకాహారం తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ శోభా,, ఆశ వర్కర్ మంజుల తదితరులు పాల్గొన్నారు.



బాలామృతం పంపిణీ చేస్తున్న సూపర్‌వైజర్

ప్రజా సమస్యలు తీరుస్తా

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగరంలోని పలు డివిజనలలో బీజేపీ అభ్యర్థి దన్ పాల్ సూర్యనారాయణ పర్యటించారు మొదట ఉదయం తెలంగాణ అమరవీరుల స్తూపం దగ్గర పార్కులో, జీజీ కాలేజీ గ్రౌండ్ లో వాకింగ్ చేస్తూ ప్రజల తో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ సందర్బంగా సూర్యనారాయణ మాట్లాడుతూ నగరంలో మొన్న పలు డివిజనలలో కురిసిన వర్షాల వల్ల ఇబ్బంది పడ్డ, కుటుంబ సభ్యులకు భరోసా కల్పించి ఆర్థిక సహాయం అందించారు. నగరంలో డబుల్ బెడ్ రూమ్‌లు అంద చేయకపోవడంతో పేదలు రేకుల షెడ్డు కింద జీవించాల్సి వస్తుందని అన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఆవాస్ యోజన కింద ప్రతి ఒక్కరికి ఇండ్లు అందచేస్తుందని తెలిపారు. వారి బాధలు చూసి తక్షణ సహాయం అందించామన్నారు. రాబోయే రోజుల్లో పేదలకు డబుల్ బెడ్ రూమ్‌లు అందజేస్తామని తెలిపారు. ఎన్నికల రోజు పోలీసులు విచక్షణ రహితంగా బీజేపీ కార్యకర్తల పై దాడులు చేయడంపై ఖండించారు. ప్రజాసౌమ్య బద్దంగా ప్రజలంతా ఓటు వేస్తే పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి మా కార్యకర్తలపై దాడి చేసి గాయపరిచరాని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు గడ్డం రాజు, పుట్ట వీరేందర్, జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మి నారాయణ, గట్ల గంగాధర్, మఠం పవన్, బట్టికర్ ఆనంద్, పవన్ ముందడ, డివిజన్ వాసులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ధన్‌పాల్ సూర్యనారాయణ

ఇరువురి మధ్య ఘర్షణ

● కత్తెరలతో పొడుచుకోవడంతో గాయాలు ● కేసు నమోదు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ఎంజె హాస్పిటల్ రోడ్‌లో హెయిర్ సెలూన్‌లో శనివారం బంధువుల మధ్య జరిగిన కత్తి పోట్ల ఘటనలో ఇద్దరు గాయపడగా వారిని జిల్లా కేంద్రంలోని ప్రైవేటు అసుపత్రికి తరలించారు. వివరాల ప్రకారం... ఉత్తరప్రదేశ్‌కు చెందిన అఖిల్, అసిఫ్ లు హెయిర్ సెలూపేకత నిర్వహిస్తుండగా వారి మధ్య వ్యాపార లావాదేవీల్లో గొడవలు జరిగాయి. గొడవలతో విడిపోయి వ్యాపారం చేయాలని నిర్ణయించు కున్నారు. ఇరువురు కలిసి పెట్టిన పెట్టుబడి విషయంలో గొడవలు జరిగిన సమయంలో అక్కడే ఉన్న కత్తెరలతో పొడుచు కోవడంతో ఇద్దరు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చందూర్‌లో వరి నాట్లు షురూ..

నవతెలంగాణ-వర్ని(చందూర్)

మండలంలోని కుమ్మరి బాబు అనే రైతు తన పంట చేలో బుధవారం వరి నాట్లు వేశారు. నవంబర్ చివరి దశలో వేయడంతో తొందరగా వంట చేతికి వస్తుందని, దిగుబడి కూడా పెరుగుతుందన్నారు. డిసెంబర్ మొదటి వారం వరకు వరి పైరు వేసుకొంటే సరియైన సమయంలో పంట కోతకు వస్తుందని అన్నారు. లాభాలు కూడా వస్తాయని తెలిపారు. వడగండ్ల వర్షానికి పంట నష్టపోకుండా జాగ్రత్త పడవచ్చని తెలిపారు. మంచి ధర వస్తుందని అన్నారు.



క్షణ క్షణం ఉత్కంఠ భరితం

● అభ్యర్థుల భవితవ్యం తేలేది నేడే



నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ జిల్లాలో ఆరు నియోజకవరాలలో మొత్తం 77 మంది అభ్యర్థులు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీలో నిలబడ్డారు. వీరందరి భవిష్యత్తు నేడు తేలనుంది, నేడు నిజామాబాదలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఉదయం 8 గంటల నుండి ఆరు నియోజకవర్గాల కౌంటింగ్ ప్రారంభం కానుంది, ఇందులో ముఖ్యంగా ప్రధాన పార్టీలకు సంబంధించిన అభ్యర్థులు నిలబడ్డారు, బిజెపి, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల అభ్యర్థులు గట్టి పోటీని ఇచ్చారు. అందులోనూ గతంలో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన వారు, గెలిచినవారు ఉన్నారు. దాంతోపాటుగా కొత్త అభ్యర్థులు సైతం అసెంబ్లీ ఎన్నికల పోటీలో ఉన్నారు. ఇందులోనూ ఎవరు గట్టెక్కుతారో వేచి చూడాల్సిందే. ముఖ్యంగా నిజామాబాద్ అర్బన్ నుండి బీఆర్ఎస్ అభ్యర్థి బిగాల గణేష్ గుప్తా, కాంగ్రెస్ అభ్యర్థి మహమ్మద్ షబ్బీర్ అలీ, బిజెపి పార్టీ అభ్యర్థి ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం నుండి బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, కాంగ్రెస్ అభ్యర్థి రేకులపల్లి భూపతిరెడ్డి, బిజెపి అభ్యర్థి దినేష్ కులచారి, ఆర్మూర్ నియోజకవర్గం నుండి బీఆర్ఎస్ అభ్యర్థి ఆశన్న గారి జీవన్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి పొద్దుటూరి వినయ్ రెడ్డి, బిజెపి పార్టీ నుండి అభ్యర్థి పైడి రాకేష్ రెడ్డి, బాల్కొండ నియోజకవర్గం నుండి బీఆర్ఎస్ అభ్యర్థి వేముల ప్రశాంత్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్ కుమార్, బిజెపి అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణ, బరిలో ఉన్నారు. బోధన్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి షకీల్ ఆమేర్, కాంగ్రెస్ అభ్యర్థి పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి, బిజపి అభ్యర్థి వడ్డీ మోహన్ రెడ్డి, బీఎస్పీ అభ్యర్థి అమర్నాథ్ బాబు పోటీలో నిలిచారు. బాన్సువాడ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి ఏనుగు రవీందర్ రెడ్డి, బిజెపి అభ్యర్థి యెండల లక్ష్మీ నారాయణ ప్రధాన పార్టీల నుండి పోటీలో ఉన్నారు. వీరిలో ఎవరు గెలువనున్నారో... ఎవరు ఓటమి పాలు అవ్వనున్నారో నేటితో తేలిపోనుంది.

గెలుపుపై అంతటా ఉత్కంఠ

● ఎవరి ధీమా వారిదే

నవతెలంగాణ-మాక్లూర్

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆర్మూర్ నియోజక వర్గంలో నలుగురు అభ్యర్థులు బరిలో ఉన్నారు. అధికార పార్టీ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఆశన్నగారి జీవన్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి, బిజెపి అభ్యర్థిగా పైడి రాకేష్ రెడ్డి, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా గండికోట రాజన్న బరిలో ఉన్నారు. వీరిలో బీఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వీరు నువ్వా నేనా అనాట్టు ప్రచారం చేశారు. ఒకరిపై ఒక్కరూ విమర్శలు చేసుకుంటూ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేస్తూ ముందుకు సాగారు.

అధికార పార్టీకి ధీటుగా ప్రతిపక్ష పార్టీల పోటీ..

అధికార పార్టీ అభ్యర్థి జీవన్ రెడ్డికి ధీటుగా ప్రతి పక్ష పార్టీలైన బిజెపి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు పోటీ పడ్డారు. తమ నాయకులతో ఎప్పటికప్పుడు చర్చలు జరుపుకుంటూ ముందుకు వెళ్ళారు. గత తొమ్మిది సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి జీవన్ రెడ్డికి గట్టి పోటీని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వినయ్ కుమార్ రెడ్డి, బిజెపి అభ్యర్థి పైడి రాకేష్ రెడ్డి ఇచ్చారు. వినయ్ కుమార్ రెడ్డి గత కొన్ని సంవత్సరాలుగా


జీవన్‌రెడ్డి


వినయ్‌రెడ్డి


రాకేష్‌రెడ్డి

స్వచ్ఛందంగా పేదలకు సేవ చేయడంతో గ్రామాల్లో ఆయనకు మంచి ఫాలోవర్స్ ఉన్నారు. దానికి తోడు బిజెపిలో ఉండి 2018లో పోటీ చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి టికెట్ ఆశించిన ఆయనను పక్కకు నెట్టడంతో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకొని కాంగ్రెస్ నుంచి పోటీలో ఉన్నారు. ఆయనతో పాటు కొంత మంది బిజెపి నాయకులు, ఆయన ద్వారా లబ్దిపొందిన ప్రజలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీనికి తోడు కాంగ్రెస్ పాత క్యాడర్ ఉండటంతో ఆయనకు మంచి సపోర్ట్ దొరికింది. బీఆర్ఎస్ నాయకులు కూడా సపోర్ట్ చేస్తున్నారని అంతర్గతంగా చెప్పుకుంటున్నారు. దానికి తోడు మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్ రావు కాంగ్రెస్‌లో చేరడంతో ఆయన ఆర్మూర్ నియోజక వర్గంలో ప్రభావం చూపగల్గుతున్నారు. ఒక్కసారి ఓటమి చవి చూడటంతో ప్రజల్లో సానుభూతి ఉంది. గెలుపే లక్ష్యంగా వినయ్ రెడ్డి ముందుకు సాగుతున్నారు. బిజెపి అభ్యర్థి పైడి రాకేష్ రెడ్డి వ్యాపార వేత్త. ఎన్నికలకు నాలుగు నెలల ముందు రాజకీయాల్లోకి వచ్చారు. వచ్చి రాగానే బిజెపి టికెట్ పొంది పోటీలో ఉన్నారు. బిజెపి నాయకులు, కార్యకర్తల సహకారంతో గ్రామాల్లో తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్ అసమ్మతి వాదులు కొంత మంది బిజెపిలో చేరడంతో బలం చేకూరింది. అతి కొద్ది కాలంలోనే ఆయన ప్రచారంలో పుంజుకున్నారు. బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి గండికోట రాజన్న ప్రచారాలకు దూరంగానే ఉన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి జీవన్ రెడ్డి గ్రామాల్లో కుల సంఘాలతో ఆత్మీయ సమ్మేళనాలు పేరుతో ముందుకు వెళుతూ, అధికార పార్టీ పథకాలను ప్రజలకు వివరిస్తూ సాగారు. గెలుపుపై ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తూ ఎన్నికల్లో ముందుకు వెళ్ళారు. ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ పార్టీల మధ్యనే పోటీ నెలకొంది. వీరిలో ఎవరు గెలుపొందుతారో వేచి చూడాల్సిందే.

ప్రశాంత్ రెడ్డి గెలుపు ఖాయం

● హ్యాట్రిక్ విజయం ఆయన సొంతం
● బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కట్ట మహేష్



నవతెలంగాణ-ముప్కాల్

తెలంగాణ రాష్ట్ర మంత్రిగా బాల్కొండ నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ అనేక అభివృద్ధి పనులు చేసిన బాల్కొండ ఎమ్మెల్యే, మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఈ 2023-అసెంబ్లీ ఎన్నికల్లో మూడోసారి 'హ్యాట్రిక్' విజయం సాధిస్తారని ముప్కాల్ మాజీ ఉప సర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కట్ట మహేష్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు.. ఈ సందర్భంగా ఆయన శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బాల్కొండ నియోజకవర్గంలో వంద శాతం బీటీ రోడ్డు పనులు పూర్తి చేయడం, 80శాతం రహదారులను రెండు వరుసల రోడ్లుగా మార్చడం, అలాగే రూ.2 వేల కోట్లతో మెండోరా మండలంలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు 'పునర్జీవన పథకం' పూర్తి చేశామన్నారు. భూగర్భజలాల కోసం రూ.150 కోట్ల రూపాయలతో 24 చెక్ డ్యామ్‌లను నిర్మించడం. నియోజకవర్గంలో మండలాలకు గాను ఎనిమిది మండలాల్లో సెంట్రల్ లైటింగ్, రోడ్డుకు మధ్యలో డివైడర్ల నిర్మాణం చేశారని తెలిపారు. భీంగల్ మండలంను మున్సిపాలిటీగా మార్చి రూ.100 కోట్ల రూపాయలు మంజూరుచేసి అభివృద్ధి చేశారని అన్నారు. భీంగల్‌లో నిలిచిపోయిన బస్ డిపోను పునుద్ధరించారని, గ్రామాల్లో సీసీ రోడ్ల కోసం రూ.100 కోట్ల రూపాయలను మంజూరు చేశారని, భీంగల్ తో పాటు బాల్కొండకు అదనంగా మరొక అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేశారని తెలిపారు. మోర్తాడ్, భీంగల్ మండలాల్లో డిగ్రీ కళాశాలలు ఉండగా, ఈ మధ్యకాలంలో బాల్కొండకు అదనంగా మరొక డిగ్రీ కళాశాలను సైతం ఏర్పాటు చేయించారని అన్నారు. మరోవైపు చూస్తే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి పనులు, ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రశాంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధిలో భాగమై మూడోసారి (హ్యాట్రిక్) ఎమ్మెల్యేగా గెలిచే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయని ధీమా వ్యక్తం చేశారు..

నేడు మద్యం షాపులు బంద్

నవతెలంగాణ-ఆర్మూర్

జిల్లా మెజిస్ట్రేట్, కమిషనర్ ఆఫ్ పోలీస్ ఆదేశానుసారం తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో నేడు మద్యం షాపులు బందు చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ స్టీవెన్ సన్ శనివారం తెలిపారు. బార్లు, కళ్ళు డిపోలు, వైన్స్ షాపులు నేటి ఉదయం 6 గంటల నుండి సోమవారం ఉదయం 6 గంటల వరకు శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూడడానికి మూసి వేస్తున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి

నవతెలంగాణ-భీంగల్

మండలంలోని బెజ్జోర గ్రామంలో బీజేపీ నాయకులు బెదిరింపు లకు పాల్పడడంతో మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్న తొనిగండ్ల రాజా గౌడ్ కుటుంబాన్ని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుని చిత్రపటానికి పూలమా లలు వేసి నివాళులర్పించి వారి కుటుంబానికి మనోధైర్యాన్ని కల్పించి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా కల్పించారు. మంత్రి వెంట డిసిసిబి వైస్ చైర్మన్ రమేష్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నర్సయ్య. సర్పంచ్ కోగోరు ప్రతిభా సుమన్, ఎంపీటీసీ నర్సయ్య ఉన్నారు.


బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి వేముల

మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన సబ్ కోర్టు జడ్జి

నవతెలంగాణ-ఆర్మూర్

బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మధ్యాహ్న భోజనాన్ని సబ్ కోర్టు జడ్జి నసీం సుల్తానా శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం.. నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. కోడిగుడ్డు, పప్పు దినుసులు, కూరగాయలు తప్పనిసరిగా ఉండాలి అన్నారు. లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని జడ్జి పేర్కొన్నారు. ప్రతి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మధ్యాహ్న భోజన నిర్వహణపై పర్యవేక్షణ చేస్తూ ఒక ఉపాధ్యాయుడు విద్యార్థులతోపాటు భోజనం చేయాలన్నారు. మధ్యాహ్న భోజన బిల్లులు సక్రమంగా రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని జడ్జి దృష్టికి మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు తీసుకొ చ్చారు. నిరుపేద విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రత్యేకచొరవ తీసుకొని మంచి ప్రయోజకులంగా విద్యార్థులను తయారు చేయాలని ఆమె హితవు పలికారు. డిజిటల్ క్లాసులను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యతోపాటు జనరల్ నాలెడ్జి పెంచుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి రాజా గంగారం, లీగల్ కోర్ట్ కౌన్సిలర్ రాజేశ్వర్, సుఖేష్, పాఠశాల ప్రధానోపాధ్యా యులు లక్ష్మీనరసయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్న జడ్జి

ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో ఘనంగా సాంఘిక శాస్త్ర ప్రదర్శన

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి శివారులోని గాంధీనగర్‌లోగల ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో సాంఘిక శాస్త్ర ప్రదర్శన కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా పాఠశాల పరిపాలన అధికారి పద్మ హాజరై మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యార్థులకు పుస్తకాల్లోని పాఠాలతో పాటుగా ప్రతి పాఠానికి ఒక ప్రాజెక్టు తయారు చేయించాలని అన్నారు. వాటితో విద్యార్థుల సృజనాత్మకత పెరుగుతుందని తెలిపారు. విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయడానికి ఇలాంటి కార్యక్రమాలను ప్రతి నెల నిర్వహిస్తామని ఆమె అన్నారు. విద్యార్థులు తయారు చేసిన సాంఘిక శాస్త్ర ప్రాజెక్టులను ఆమె తిలకించారు. ప్రాజెక్టులకు సంబంధించిన పూర్తి వివరాలను విద్యార్థుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. వాటి యొక్క ఉపయోగాలను విద్యార్థులు చక్కగా వివరించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమేష్, స్కూల్ ఇన్చార్జి సృపన్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.


సాంఘిక శాస్త్ర ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

టెన్షన్.. టెన్షన్



- ఇంకొన్ని గంటల్లోనే తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తుదకు అంతిమ సమయంరానే వచ్చింది. అభ్యర్థులు ద్వితీయ శ్రేణి నాయకుల్లో టెన్షన్ నెలకొంది. గత కొన్ని నెలల నుండి తమ అభ్యర్థుల గెలిపునకు చెమటోడ్చి ఓట్లు వేయించిన నాయకులకు ఎక్కువ టెన్షన్ పట్టుకుంది. ఈ బూత్ వారీగా ఏ పార్టీకి ఎంత మెజార్టీ వస్తుందోనని మదన పడుతున్నారు. పొద్దునక రాత్రనక ఓటర్లను ప్రసన్నం చేసుకొని ఆయా పార్టీల తాయిలాలను అందజేసి ప్రసన్నం చేసుకున్న అంతిమ సమయంలో వారు ఓటు ఎవరికి వేశారో ఇప్పటికీ అంతు చిక్కని పరిస్థితి నెలకొంది.

ఏ పార్టీ చూసినా మేకపోతు గాంభీర్యం..

ప్రదర్శిస్తున్న లోలోన వారికి భయం కనబడుతూ ఉంది. గతంలో ఫలానా అభ్యర్థి ఎన్ని ఓట్ల మెజారిటీతో గెలుస్తారని చెప్పుకున్న నాయకులు నేడు ఆ మెజార్టీని పక్కకు పెట్టి ఒక్క ఓటుతోనైనా గెలిస్తే చాలు అని అనుకుంటున్నారు. తమ స్నేహితులు తెలిసిన వారి వద్ద కూడా ఇదే మాట చెప్పుకుంటున్నారు. జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం ఉదయం 8 గంటల నుండి కౌంటింగ్ ప్రారంభమై మధ్యాహ్నం వరకు ఫలితాలు వచ్చే అవకాశం ఉంది. 14, 16 రౌండ్ల వరకు కొనసాగే ఈ కౌంటింగ్‌లో రౌండ్ రౌండ్‌కు ఫలితాలు తారుమారు కావచ్చనే అంచనాలు లేకపోలేదు. ఏ పార్టీ అయినా తమ అభ్యర్థి ఎన్ని ఓట్లతో గెలుస్తారని చెప్పే ధైర్యం కూడా చేయకపోవడం వారికి గెలుపుపై ఎంత నమ్మకముందో అర్థమయిపోతుంది. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి మూడు శాతం మీద ఓటింగ్ సరళి తగ్గిన గెలుపు ఓటమిలో బీఆర్ఎస్ కాంగ్రెస్ మధ్య ఉంటుందని ఎన్నికల పరిశీలకులు భావిస్తున్నారు. కొన్నిచోట్ల బిజెపి గట్టి పోటీ ఇచ్చిందని చెప్పక తప్పదు. ఎమ్మెల్యే అభ్యర్థి మంచి పేరు ఉన్న గ్రామీణ ప్రాంతాల నాయకులు ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత ఎన్నికల్లో స్పష్టంగా కనబడినట్లు ఎన్నికల రోజు స్పష్టమైంది. 2014, 2018లో నిజామాబాద్ రూరల్ లో జరిగిన ఎన్నికల్లో బిఅర్ఎస్ పార్టీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ 20నుండి 30వేల ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ఈసారి రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన మార్పులో బాగంగా ఎవరు గెలిచినా వేలు, వందల ఓట్ల మధ్యనే గెలుపు ఓటములు ఉంటాయని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఈసారి ప్రజలు సైతం తమ అభిప్రాయాలను చెప్పడానికి నిరాకరిస్తూనే ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను తేల్చి చెప్పారు. అనుక్షణం టెన్షన్ టెన్షన్‌గా అభ్యర్థులతోపాటు ద్వితీయ శ్రేణి నాయకత్వం ఎదురు చూస్తుంది.

తమ గ్రామాల్లో అభివృద్ధితోపాటు ఎంతో కొంతమేర అందజేసిన తమ పట్ల ప్రజలకు ఎందుకు వ్యతిరేకత వచ్చిందో కొన్ని పార్టీలు ఇప్పటివరకు వేసుకోవడంలోనే నిమగ్నమై ఉన్నట్లు పలు నియోజకవర్గాలను బట్టి తెలుస్తుంది. ఏది ఏమైనా అభ్యర్థులు మాత్రం తామే గెలుస్తున్నామని పైపైకి చెప్పుకుంటున్న ఏదో ఒకచోట వారిలో టెన్షన్ మొదలైనట్లు వారి మాటల ద్వారానే తెలుస్తుంది. నిజామాబాద్ జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలలో బీఆర్ఎస్ పార్టీలో అందరూ పాత ఎమ్మెల్యే అభ్యర్థులే రంగంలోకి దిగగా కాంగ్రెస్ పార్టీ ఒకరిద్దరు మినహా మిగిలిన కొత్త వారిని గతంలో పోటీ చేసి ఓడిపోయిన వారిని రంగంలోకి దించారు. దాదాపు బిజెపి పరిస్థితి కూడా అదే ఉంది. టికెట్ ఆశించి భంగపడ్డ నాయకులు గత్యంతరం లేక ఇతర పార్టీలోకి వెళ్లి ఆ పార్టీల టికెట్లు తీసుకొని వచ్చి తమ అదృష్టాన్ని పరీక్షించుకున్న వారికి డిపాజిట్ కూడా వచ్చే పరిస్థితులు మాత్రం కనబడటం లేదు. ఇదే కాకుండా తామేమి తక్కువ కాదన్నట్టు

స్వతంత్ర అభ్యర్థులు కూడా ఎన్నికల్లో పోటీ చేశారు. మూడు ప్రధాన పార్టీలు వదిలి అందరికీ డిపాజిట్ కూడా దక్కే అవకాశం కూడా కనుమరుగు కానుందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. కామారెడ్డి విషయానికి వస్తే కాంగ్రెస్‌బీబిఆర్ఎస్ నుంచి సీఎం అభ్యర్థులే కావడంతో అందరి అంచనాలు కామారెడ్డి నియోజకవర్గంలో పైనే కేంద్రీకృతమై ఉన్నాయి. బాన్సువాడలో రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, బాల్కొండలో రెండుసార్లు మంత్రి పదవి పొందిన వేముల ప్రశాంత్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్‌లో సీనియర్ ఎమ్మెల్యే ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, జుక్కల్‌లో ప్రొటెం స్పీకర్ హన్మంత్ షిండే, ఎల్లారెడ్డిలో జాజుల సురేందర్, నిజామాబాద్ అర్బన్ లో గణేష్ గుప్తా, బోధన్‌లో షకీల్ అమేర్ పోటీలో ఉన్నారు. వీరంతా ఎమ్మెల్యేగా ప్రస్తుతం ఉన్నారు. ఎన్నికల కౌంటింగ్ ఫలితాలు అభ్యర్థుల భవితవ్యం కొన్ని గంటల వ్యవధిలోనే తేటతెల్లం కానున్నాయి.

గెలుపోటములపై జోరుగా బెట్టింగ్‌లు

ఒకపక్క సర్వేలన్నీ కాంగ్రెస్‌కు అనుకూలంగా ప్రజా తీర్పు పెరుగుతుందని చెప్తున్నా ఒక రెండు, మూడు సర్వేలు మాత్రం బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపుతున్నాయి. ఇది ఇలా ఉంటే కొందరు బెట్టింగ్ రాయుళ్లు సర్వేలు జాంతానై ఈ అభ్యర్థి గెలుస్తున్నాడని భారీగా గెలుపోటములపై లక్షలాది రూపాయల మేర బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇది బయటకు ఎక్కడ పొక్కకుండా సెల్ ఫోన్‌లలోనే బెట్టింగ్ చేసుకుంటున్నారని తెలిసింది. ఇదే కాకుండా రౌండ్‌ల వారీగా కూడా బెట్టింగ్ పెడుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈసారి జరిగిన ఎన్నికల్లో మూడు ప్రధాన పార్టీలు అధికారమే ధ్యేయంగా ప్రచారాలను హోరెత్తించి ఓటర్లును ఆకట్టుకునే విధంగా గుర్తు చప్పుడు కాకుండా తాయిలాలను అందజేసినట్లు సమాచారం. దానిలో భాగంగానే సర్వేల ఆధారంగా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే లక్షల రూపాయలు వెట్టింగ్ కాసినవారికి పండగే పండగ అవుతుంది అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

అంగన్వాడీ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో శనివారం హెల్త్ సూపర్ వైజర్ మారుతి చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. చిన్నారుల ఆరోగ్య విషయంలో వారి తల్లులకు, అంగన్వాడీ టీచర్లకు, పలు సలహాలు, సూచనలు అందించానన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ పండరీ, ఏఎన్ఎం కల్పన, అంగన్వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.



గెలుపెవరిదో

- వేములకు హ్యాట్రిక్ విజయం వరించేనా..?
- సునీల్ కుమార్‌కు తొలి విజయం దక్కేనా
- అన్నపూర్ణమ్మ తిరిగి ట్రక్‌లోకి వచ్చేనా
- బాల్కొండ పోరు అద్వితీయం

నవతెలంగాణ-ముప్కాల్



తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల పోరు ఒక రకంగా ఉంటే అందుకు భిన్నంగా బాల్కొండ నియోజకవర్గ పోరు మరొకరకంగా ఉంది. బాల్కొండ ఎమ్మెల్యేగా రెండు పర్యాయాలు తొలి దఫా "మిషన్ భగీరథ పథకం' వైస్ ఛైర్మన్‌గా, రెండోసారి గెలిచి రాష్ట్ర మంత్రిగా కొనసాగారు. మూడోసారి 2023-అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తూ హ్యాట్రిక్ విజయం కోసం ఎదురుచూస్తున్న వారిలో ఒకరు వేముల ప్రశాంత్ రెడ్డి.. బాల్కొండ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులే తనను ఈ ఈసెంబ్లీ ఎన్నికల్లో గెలిచేలా చేస్తుందని ధీమాతో ఉన్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి తొలి విజయం కోసం అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. గత 2018 అసెంబ్లీ ఎన్నికల్లో సునీల్ కుమార్ రెడ్డి బీఎస్పీ నుంచి పోటీ చేసి ఓటమిని ఎదుర్కొన్నారు. అయినా బాల్కొండ నియోజకవర్గంను సునీల్ కుమార్ రెడ్డి మరిచిపోలేదు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో చేరారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆపదలో ఉన్న కుటుంబాలను పరమర్శిస్తూ తనవంతు సేవలను అందిస్తూ వస్తున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కోటి రూపాయల నిధిని వెచ్చించి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ వస్తున్నారు. ఆనాడు ఓడినా బాల్కొండ ప్రజలకు అందుబాటులో ఉండటం ఈ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం తథ్యమని సునీల్ కుమార్ రెడ్డి భావిస్తున్నారు. అదేవిధంగా బీజేపీ నుంచి ఈ సారి ఆర్మూర్ కాకుండా బాల్కొండ నుంచి పోటీచేస్తున్న ఏలేటి అన్నపూర్ణమ్మ తిరిగి ఎమ్మెల్యేగా గెలుస్తారా అనేది వేచిచూడాలి. గతంలో ఆమె ఆర్మూర్ ఎమ్మెల్యేగా కొనసాగారు. గెలుపుపై ఎవరి ధీమాలో వారున్నారు. అభివృద్ధి పనులతో ప్రశాంత్ రెడ్డి, ప్రజల ఆదరణతో సునీల్ కుమార్ రెడ్డిల మధ్య ఆసక్తికరమైన పోరు కొనసాగనుంది. చివరికి విజయం ఎవరిని వరిస్తుందో (డిసెంబర్ 3) ఆదివారం సాయంత్రంలోపు తేలిపోనుంది.

మాయమాటలు చెప్పి

వృద్ధురాలి బంగారం చోరీ

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పట్టణ కేంద్రంలోగల పెర్కిట్ 4వ వార్డు పరిధిలో 85 ఏండ్ల వయస్సు గల వృద్ధురాలైన సాహెబ్ గారి రాజు భాయికి పింఛన్ మంజూరు అయిందని మాయ మాటలు చెప్పి గుర్తు తెలియని యువకుడు బంగారం ఎత్తుకెళ్లిన ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. 85ఏళ్ల వృద్ధురాలైన సాహెబ్ గారి రాజు బాయికి పింఛను మంజూర యిందని, మాయ మాటలు చెప్పి ఓ గుర్తు తెలియని యువకుడు నమ్మించి ఆమె మెడలోని రెండున్నర తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లి అక్కడినుంచి పరారయ్యాడు. బాధితురాలు ఇంటికి గుర్తు తెలియని యువకుడు వెళ్లి అమ్మ మీకు పింఛన్ మంజూరు అయింది.. మీ ఫోటో తీసుకోవాలి.. ఈ ఫోటోలో మీ శరీరంపైన ఉన్న బంగారం ఉంటే మీరు ఉన్నవారుగా భావించి మీకు పింఛను రాదని మాయమాటలు చెప్పి, ఆ వృద్ధురాలి శరీరంపై తులం పడిగెలు, తులం గుండ్లను, అర తులం మెంచులను ఆమెతోనే తీయించి కింద ఒక పేపర్లో పెట్టించాడు. ఆమెను పింఛన్ కోసం ఫోటో తీస్తున్నట్లుగా ఫోటోలు తీసి మాయమాటలతో నమ్మిస్తూ పేపర్ లో పెట్టిన రెండున్నర తులాల బంగారు నగలను ఆ గుర్తుతెలియని దుండగుడు తీసుకుని పరారయ్యాడు. ఇదంతా జరుగుతుండగా ఆ వృద్ధురాలి 62 ఏళ్ల వయసుగల నడిపి కుమారుడైన మహేందర్ అదే ఇంట్లో పక్షవాతం వ్యాధితో బాధపడుతూ ఓ మంచంలో పడుకుని ఉన్నాడు. కుమారుడు ఇదేం నమ్మకమ్మ ఇట్లా ఏముండదని చెబుతున్న.. పింఛను మంజూరు మోజులో పడి ఆ వృద్ధురాలు రెండున్నర తులాల బంగారు నగలను పోగొట్టుకుంది. విషయం తెలిసి ఆమె సమీప బంధువులు లబోదిబోమని మొత్తుకొని ఏడ్చారు. ఇంట్లో వృద్ధురాలని నమ్మించి మాటల్లో పెట్టి బంగారు నగలు కాజేసిన విషయాన్ని ఆర్మూర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపారు.



నేడు మద్యం దుకాణాలు బంద్

- నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ వెల్లడి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నేడు ఓట్ల కౌంటింగ్ ఉన్నందున నిజామాబాద్ జిల్లాలో వైన్ షాపులు బంద్ చేయనున్నట్లు సీపీ కల్మేశ్వర్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 6గంటల నుంచి సోమవారం ఉదయం 6గంటల వరకు మద్యం దుకాణాలను మూసివేయాలని పేర్కొన్నారు. జిల్లాలో నేడు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదని, టపాసులు కాల్చొద్దని సూచించారు. కౌంటింగ్ కేంద్రంలోకి అగ్గిపెట్టెలు, లైటర్లు, మొబైల్ ఫోన్లు తీసుకెళ్లరాదని పేర్కొన్నారు.

రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలని..

- వీరాభిమాని సైకిల్‌యాత్ర

నవతెలంగాణ-బాల్కొండ


బాల్కొండకు వచ్చిన అభిమాని

రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిగా చూడాలన్న తలంపుతో ఒక వీరాభిమాని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వినుకొండ నుంచి ఢిల్లీ వరకు సైకిల్ యాత్రను చేపట్టారు. ఈ యాత్ర శనివారం బాల్కొండ మండలానికి చేరింది. పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన మద్దినేని వీరాంజనేయులు నవంబర్ 23న భారత్ జోడో యాత్రలో భాగంగా సైకిల్ యాత్రను చేపట్టారు. డిసెంబర్ చివరి మాసం వరకు ఢిల్లీ వరకు చేరుకొని రాహుల్ గాంధీని కలుసుకొని తన ఆకాంక్షను తెలియజేయనున్నారు. 2024లో రాహుల్ గాంధీ ప్రధానిగా ఉంటారని ఆయన జోస్యం చెప్పారు.

బాధితుడికి ఆర్థిక సహాయం


పరామర్శిస్తున్న సునీల్‌కుమార్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

వేల్పూర్ మండలం పడగల్ గ్రామానికి చెందిన మాడవిడి గంగాధర్‌కు బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్యాల సునీల్ కుమార్ రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో మాడవిడి గంగాధర్ కాలు విరిగింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్యాల సునీల్ కుమార్ శనివారం బాధితుడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చుల కోరకు రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సునీల్‌కుమార్

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని వేంపల్లి గ్రామానికి చెందిన గొల్ల చిన్నయ్య ఇటీవల గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్ కుమార్ రెడ్డి బాధిత కుటుంబాన్ని శనివారం పరామర్శించి సానుభూతిని తెలిపారు. అదే గ్రామానికి చెందిన మరొక బాధితుడు గొల్ల నర్సింగ్ కుటుంబాన్ని సైతం ఆయన పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు సరికెల గంగారాం, వేంపల్లి సొసైటీ చైర్మన్ జక్కు రాజేశ్వర్, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు రాజ్ కుమార్, మాజీ ఉపసర్పంచ్ లు గుండ్ల రాజన్న, ఏట్టెం మహేష్, గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేష్ పాల్గొన్నారు.

ఏ చిన్న పొరపాటుకు ఆస్కారం ఉండొద్దు

- ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- సీపీతో కలిసి కౌంటింగ్ సెంటర్ల పరిశీలన
- రిటర్నింగ్ అధికారులతో సమీక్ష

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ


మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పోలైన ఓట్ల లెక్కింపు కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో కొనసాగనున్న ఓట్ల లెక్కింపును పురస్కరించుకుని కలెక్టర్ శనివారం పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ తో కలిసి కౌంటింగ్ సెంటర్లను పరిశీలించారు. ఆయా సెగ్మెంట్లలో కౌంటింగ్ కోసం చేసిన ఏర్పాట్లను నిశితంగా పరిశీలన జరిపారు. కౌంటింగ్ హాళ్లలో ఏర్పాటు చేసిన టేబుళ్లు, బారికేడ్లు, సిసి కెమెరాలు, స్ట్రాంగ్ రూంల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అంతకుముందు కలెక్టర్ తన ఛాంబర్ లో ఆరు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సెగ్మెంట్ల వారీగా ఓట్ల లెక్కింపు పక్కాగా జరిగేలా పర్యవేక్షణ జరపాలని సూచించారు. ఉదయం 5.00 గంటలకు పరిశీలకుల సమక్షంలో కౌంటింగ్ సిబ్బంది మూడవ విడత రాండమైజేషన్ జరిపించాలని ఆర్.ఓలకు మార్గనిర్దేశం చేశారు. నిర్ణీత సమయానికి ఓట్ల లెక్కింపు ప్రారంభించేందుకు వీలుగా అన్నివిధాలుగా సన్నద్ధమై ఉండాలన్నారు. ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద నియోజకవర్గ వివరాలను తెలిపే ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని, ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపును చేపట్టి సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా నిబంధనలను తు.చ తప్పకుండా పాటించాలని, పోస్టల్ బ్యాలెట్ ఓటు తిరస్కరణకు గురైతే అందుకు గల కారణాలను అభ్యర్థులు, వారి ఏజెంట్లకు స్పష్టంగా తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. ఈవీఎంల ఓట్లను ఒక్కో రౌండ్ వారీగా జాగ్రత్తగా లెక్కిస్తూ, ప్రతి రౌండ్ కు ఏజెంట్ల సంతకాలు తీసుకోవాలని అన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఈవీఎంలలో ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితే సంబంధిత నిపుణులు వచ్చి సరిచేస్తారని, కౌంటింగ్ ప్రక్రియను యధాతథంగా కొనసాగించాలని తెలిపారు. కౌంటింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బందితో పాటు, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో వివిధ కార్యకలాపాల నిర్వహణ కోసం నియమించబడిన ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా పాసులు అందించాలని, పాసు కలిగి ఉన్న వారినే కౌంటింగ్ సెంటర్ లోనికి అనుమతించాలని సూచించారు. అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా తుది ఏర్పాట్లను సరిచేసుకోవాలని, సిబ్బందికి అల్పాహారం, భోజనాల కోసం తగిన ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. ఎలాంటి గందరగోళానికి తావులేకుండా పక్కాగా నిబంధనలను పాటిస్తూ, పూర్తి పారదర్శకంగా నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తూ కౌంటింగ్ ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని హితవు పలికారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ, అవసరమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని అన్నారు. కాగా, కౌంటింగ్ ప్రక్రియ ముగిసిన మీదట అభ్యర్థులు, వారి ఏజెంట్లు, పరిశీలకుల సమక్షంలో ఈవీఎంలను సీల్ చేసి జిల్లా కేంద్రంలోని గోడౌన్ కు తరలించేలా ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు రిటర్నింగ్ అధికారులకు సూచించారు. కాగా, ఆరు సెగ్మెంట్లకు సంబంధించి మొత్తం 122 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 131 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 123 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని, వీరికి ఇప్పటికే పలు విడతలుగా మాస్టర్ ట్రైనర్స్ చే కౌంటింగ్ నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగిందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. రిజర్వు సిబ్బంది సైతం అందుబాటులో ఉంటారని అన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా ప్రతి నియోజకవర్గానికి ఓట్ల లెక్కింపుకై 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేస్తూ, రౌండ్ల వారీగా కౌంటింగ్ నిర్వహించేలా పకడ్బందీ చర్యలు తీసుకున్నామని అన్నారు. ఆర్మూర్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు 16 రౌండ్లలో పూర్తి కానుండగా, బోధన్ 18 రౌండ్లలో, బాన్సువాడ 19 రౌండ్లు, నిజామాబాద్ అర్బన్ 21 రౌండ్లు, నిజామాబాద్ రూరల్ 21 రౌండ్లు, బాల్కొండ నియోజకవర్గ ఓట్లను 18 రౌండ్లలో లెక్కించడం జరుగుతుందని వివరించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, పి.యాదిరెడ్డి, నగరపాల సంస్థ కమిషనర్ ఎం.మకరందు, అదనపు డీసీపీలు జయరాం, గిరిరాజు ఉన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

దూపల్లిలో చెరుకు పంటకు తీవ్ర నష్టం

నవతెలంగాణ-రెంజల్


చెరుకు పంటను పరిశీలిస్తున్న అధికారులు

ఈనెల 28న కురిసిన వడగళ్ల వర్షానికి రెంజల్ మండలం దూపల్లి గ్రామానికి చెందిన 22 మంది రైతుల చెరుకు పంట పూర్తిగా డ్యామేజ్ అయిందని వ్యవసాయ అధికారి లక్ష్మీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ గ్రామంలో 48. 22 ఎకరాలలో పంట నష్టం జరిగినట్లు జిల్లా వ్యవసాయ అధికారులకు నివేదికను పంపడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ గ్రామానికి చెందిన రైతులు చెరుకు సాగు చేయగా పెద్ద లక్ష్మారెడ్డి, ప్రతాప్ రెడ్డి, చిన్న లక్ష్మారెడ్డి, హయ్ మధులకు సంబంధించిన పంటలను పరిశీలించి జిల్లా వ్యవసాయ అధికారులకు నివేదికను అందజేశామని ఆయన తెలిపారు.

ఎబివిపి జాతీయ మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఇందూర్ శాఖ ఆధ్వర్యంలో గిర్రాజ్ డిగ్రీ కళాశాలలో 69 వ జాతీయ మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఇందూర్ జిల్లా కన్వీనర్ దామ సునీల్ మాట్లాడుతూ.. డిసెంబర్ 7 -10 తేదీల్లో ఢిల్లీలో 69వ జాతీయ మహాసభలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ మహాసభల్లో విద్యారంగ సమస్యలు, భారతదేశంలో జరుగుతున్న వివిధ అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. ఏబీవీపీ ప్రారంభమై 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా 10వేల మందికి ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారని చెప్పారు.

ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా దేశ ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొననున్నారని తెలిపారు. సమావేశంలో సామాజిక కార్యక్రమంలో పని చేసే వ్యక్తులకు యశ్వంతరావు కేల్కర్ అవార్డును ప్రధానం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సంవత్సరం ముగ్గురిని ఎంపిక చేయడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో గిరి రాజ్ సెక్రెటరీ మేఘన ,గోపి మానస, నికిత తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాలకు..

- సహాయ ఆచార్యులు

పోలపల్లి శ్రీకాంత్‌కి ఆహ్వానం

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్



అంతర్జాతీయ సాహిత్య సామాజిక సేవా సంస్థ శ్రీ శ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో డిసెంబర్ 16, 17న తాడేపల్లిగూడెం పశ్చిమగోదావరి జిల్లాలో జరగనున్న ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాలకు తెలంగాణ యూనివర్సిటీ సారంగపూర్‌లోని బీఈడీ కళాశాల సహాయ ఆచార్యులు పోలపల్లి శ్రీకాంత్‌కు ఆహ్వానం అందింది. ఈ కవులు, కళాకారుల ప్రోత్సాహంతో 30 గంటల 30 నిమిషాల 30 సెకన్లు ఏకధాటిగా ప్రపంచ సాహిత్య కళా ఉత్సవాలు అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో తాడేపల్లిగూడెంలోని బుద్ధాల కన్వెన్షన్ హాల్లో కవిత ఉత్సవం, సాహిత్య సదస్సులు, కళా ప్రదర్శనలు, పుస్తకావిష్కరణ, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ప్రపంచ రికార్డు కైవసం చేసుకోవాలని రవి కిషోర్ తెలిపారు. శ్రీకాంత్ కి ఆహ్వానం అందినందుకు ఆనందం వ్యక్తం చేశారు.

c m y k

కుల సంఘాల ఓట్లే కీలకం

- అవి ఎటుపడితే వారిదే గెలుపు
- గ్రామాల వారీగా గెలుపోటములపై అభ్యర్థుల అంచనాలు
- ఎవరి ధీమాలో వారే
- నేడు తేలనున్న భవితవ్యం

నవతెలంగాణ-మద్నూర్

జుక్కల్ ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో త్రిముఖ పోటీ అనివార్యమైనట్లు జుక్కల్ నియోజకవర్గ ప్రజల్లో జోరుగా చర్చ నడుస్తోంది. గెలుపోటములపై మూడు పార్టీల అభ్యర్థులు, నాయకులు అంచనా వేయలేని పరిస్థితి నెలకొంది.

నియోజకవర్గంలో మొత్తం రెండు లక్షల వరకు ఓట్ల సంఖ్య ఉండగా.. వీటిలో 1,63,569 ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గంలో భారీగా ఓటింగ్ 81.80 శాతం నమోదయ్యింది. అయితే బీఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి 'మేమంటే మేమే గెలుస్తాం' అంటూ ధీమాలో



ఉన్నారు. ఈసారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కుల సంఘాల ఓట్లు తమ వైపే అంటూ ఒక పార్టీ ధీమాలో ఉండగా.. మార్పుతో ప్రజలు మావైపే మొగ్గు చూపారంటూ మరొక పార్టీ ధీమాలో ఉంది. ఆ ఇద్దరు కంటే ఈసారి తమ వైపే ప్రజలు మొగ్గు చూపారంటూ ఇంకొక పార్టీ ధీమాలో ఉంది. ఈ విధంగా ఎక్కడ చూసినా ఈ మూడు పార్టీల నాయకులు గత రెండు రోజులుగా గెలుపు ఓటములపైన అంచనాలు వేసుకుంటున్నారు.

నియోజకవర్గంలో దాదాపు 200 గ్రామలున్నాయి. ఒక్కొక్క గ్రామంలో ఓట్లు ఎవరి వైపు పడ్డాయో ఊరూరా అంచనాలతో లెక్కలు వేసుకుంటున్నారు. ఈసారి జరిగిన ఎన్నికల్లో బహిరంగంగా ప్రజల్లో వినబడే చర్చలు కాంగ్రెస్ లేదా బిజెపి గెలుస్తుందని వాదనలు జోరుగా వినిపిస్తున్నాయి. కానీ అధికార పార్టీ అభ్యర్థి ఖచ్చితంగా గెలుస్తారని సైతం ఆ పార్టీ నాయకుల్లో జోరుగా చర్చ నడుస్తోంది. అభివృద్ధి వైపే ప్రజలు ఉన్నారని సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందుతున్నాయని ఈసారి కూడా ఇక్కడ అధికార పార్టీ అభ్యర్థి గెలుపు ఖాయమని అంటున్నారు.

ఏది ఏమైనా కుల సంఘాల ఓట్లు ఎటువైపు పడితే ఆ అభ్యర్థి గెలిచే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఏది ఏమైనా ఈసారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటరు నాడీని అంచనాలు వేయలేని పరిస్థితి కనిపిస్తోంది. ఎవరి గెలుపు అనేది నేడు తేలనుంది. త్రిముఖ పోటీ అనివార్యం కావడంతో ఎవరు గెలిచినా ఐదు నుంచి పదివేల ఓట్ల మెజార్టీలోపే ఉండవచ్చని అంచనాలు జోరుగా వినబడుతున్నాయి.

కాంగ్రెస్ పార్టీదే విజయం

- కాంగ్రెస్ పార్టీ నాయకుడు తూర్పు రాజు



సమావేశంలో మాట్లాడుతున్న తూర్పు రాజు

నవతెలంగాణ-గాంధారి

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు తూర్పు రాజు ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తూర్పురాజు మాట్లాడుతూ.. అధికార బీఆర్ఎస్ పార్టీ ఎన్ని అక్రమాలు ఎన్ని అరాచకాలు చేసినా.. అధికార దుర్వినియోగం చేసినా ఎల్లారెడ్డి నియోజక ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మదన్ మోహన్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయురాలి ఉద్యోగ విరమణ



ఉపాధ్యాయురాలికి మెమెంటో అందజేత

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలోని మండల పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్న రజనీ ప్రియ డిసెంబర్ 30న ఉద్యోగ విరమణ చేపట్టారు. కాగా శనివారం విరమణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

యాసంగి పంటకు నారుమళ్లు సిద్ధం

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని పలు గ్రామాలలోని రైతులు తమ బోరుబావుల వద్ద దుక్కులు దున్నుకొని నారుమల్లను సిద్ధం చేసుకుంటున్నారు. మండలంలోని ఎడపల్లి, మంగళ్‌పహాడ్, జైతాపూర్, కుర్నాపల్లి శివారులో బోరు బావులు కలిగి ఉన్న రైతులు ముందస్తుగానే నారు పోశారు. వానాకాలం పకృతి వైపరీత్యంతో చాలామంది రైతులు పంటను నష్టపోయారు. అలాగే పంట చేతికి వచ్చేసరికి చెడగొట్టు వానలు కురవడంతో ధాన్యం రోడ్లపై ఉండడం వల్ల ఇబ్బందులు పడాల్సి వచ్చింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని బోరు బావులు కలిగి ఉన్న రైతులు ముందుగానే పంట పొలాలలో విత్తనాలు చల్లి నారుమళ్లను సిద్ధం చేశారు. మరో 15 రోజుల్లో రైతులు నాట్లు వేసేందుకు సిద్ధంగా



ఉన్నారు. అయితే ఇదిలా ఉండగా.. బోరుబావులు లేని రైతులు నిజాంసాగర్ ప్రధాన కాలువ ద్వారా నీరు విడుదల చేస్తే నారుమళ్లను సిద్ధం చేసుకునే అవకాశం ఉంది. వెంటనే నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

కేశవ స్మృతి మందిరం నిర్మాణానికి భూమిపూజ



పూజ చేస్తున్న పీఠాధిపతి పిట్ల కృష్ణస్వామి మహారాజ్

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి గ్రామ శివారులో కేశవ శిశు మందిర నిర్మాణానికి భోపాల్ పీఠాధిపతి కమలానంద భారతి, లింగేశ్వర ఆలయం మల్లారం పీఠాధిపతి పిట్ల కృష్ణస్వామి మహారాజ్ శనివారం భూమిపూజ నిర్వహించారు. వేద పండితులతో మహా యజ్ఞం నిర్వహించిన అనంతరం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాంత సంఘ చాలా మన్యశ్రీ దక్షిణామూర్తి, మాన్యశ్రీ విభాగ్ సంచాలక్ జనగం నరేందర్, జిల్లా సంఘచాలక్ గురు చరణం, మల్లికార్జున్, చంద్రశేఖర్, వాసు, కేశవ సేవా సమితి అధ్యక్షులు సామకూర సుధాకర్, కేశవ సేవా సమితి సెక్రటరీ అంకుల్ మహేష్, రచ్చ తిరుపతి, శివకుమార్, శివశంకర్, శివకుమార్, దేవుళ్ళ యోగేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వికలాంగుల దినోత్సవం

- విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు చిప్ప దుర్గాప్రసాద్

నవతెలంగాణ-కామారెడ్డి

డిసెంబర్ 3న ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా వేడుకలను తెలంగాణ సాధన కోసం అమరులైన కానిస్టేబుల్ కిష్టయ్య విగ్రహం నిజాంసాగర్ చౌరస్తా వద్ద నిర్వహిస్తున్నామని, వికలాంగులందరూ హాజరుకావాలని విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు చిప్ప దుర్గాప్రసాద్ తెలిపారు. శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మన పూర్తి డిమాండ్ల సాధనకు కార్యాచరణ సమావేశం ఉంటుందన్నారు. భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా మన సంక్షేమ పథకాలు అమలు చేయాలని



వికలాంగుల సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దుర్గాప్రసాద్

కోరారు. ఎన్నికల కమిషన్ ప్రపంచ వికలాంగుల దినోత్సవం రోజున కౌంటింగ్ జరపడం అందరికీ కనువిప్పు కలిగించే విషయమన్నారు. కార్యక్రమంలో సబ్ కమిటీ డైరెక్టర్ గాడి నర్సింలు పాల్గొన్నారు.

నేరాల నమోదుపై పోలీసులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు


నవతెలంగాణ-బోధన్

బోధన్ కోర్టు ప్రాంగణంలో శనివారం డివిజన్ పోలీసులకు రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వైజయంతి, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీ నర్సయ్య ఆదేశాల మేరకు బోధన్ డివిజన్ పోలీసులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. క్రిమినల్ కేసులలో పోలీసుల పాత్ర ఎంతో కీలకమైనదని తెలుపుతూ వారి బాధ్యతలను అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జీ.శ్యాంరావు వివరించారు. వైట్ కాలర్ నేరాలపై, వాటికి సంబంధించిన చట్టాలపై అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ డా.పి. సమ్మయ్య వివరించారు. లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంలో చేపట్టవలసిన చర్యలపై అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిదిరాల రాణి వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎస్సైలు కృష్ణకుమార్, నరేష్, ఉదయకుమార్, సందీప్, నాగనాథ్, ఎక్సైజ్ ఎస్సై బాలయ్య, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బోధన్ బాద్‌షాఎవరో..?

నవతెలంగాణ-ఎడపల్లి

ఈనెల 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా బోధన్ బాద్‌షా ఎవరో నేడు తేలనుంది. ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి, బీఎస్పీ అభ్యర్థులతో పాటు మరో మైనార్టీ అభ్యర్థి స్వతంత్రంగా పోటీలో ఉన్నారు. కాగా ఆదివారం ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల భవిష్యత్తు ఫలితాలు వెలువడనున్నాయి. కాగా బోధన్ నియోజకవర్గంలో అభ్యర్థులు ఉత్కంఠ భరితంగా ఉన్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపోటముల గురించి పల్లె ప్రాంతాల్లో మండల కేంద్రాలు చర్చ కొనసాగుతూనే ఉంది. తమ అభ్యర్థి గెలుపు ఖాయమని ఓ పార్టీ నాయకులు, కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. తమ పార్టీ అభ్యర్థి గెలుపు ఖాయమని మరో ఆ పార్టీకి చెందిన నాయకులు కార్యకర్తలు ఆశభావం వ్యక్తం చేస్తున్నారు. ఇలా ఎవరికి వారు తమ పార్టీ అభ్యర్థినే భారీ మెజార్టీతో గెలుస్తారని



ధీమాతో ఉన్నారు. అయితే ఏది ఏమైనా అభ్యర్థుల భవితవ్యం నేడు తేలనుంది.

తొలి పూజతో ప్రారంభమైన శ్రీ కాలభైరవ స్వామి ఉత్సవాలు



మూల బావి నుంచి నీరు తీసుకువస్తున్న భక్తులు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఇస్సన్నపల్లి రామారెడ్డిలో వెలసిన శ్రీ కాలభైరవ స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం గణపతి పూజతో ప్రారంభమయ్యాయి. మూల బావి నుంచి నీరు తెచ్చి ఆలయాన్ని శుభ్రం చేసి స్వామివారికి సింధూర పూజలు నిర్వహించారు. పుణ్యాహవాచనం, ఋత్విగ్వరణం, కంకణ ధారణ, సంతత ధారభిషేకం నిర్వహించారు. నిర్వహణ దాతగా తన్నీరు లలిత- శేఖర్ కామారెడ్డి నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రభు, సిబ్బంది సురేందర్, నాగరాజు, ఆలయ పూజారులు శ్రీనివాస్ శర్మ, మనీష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

c
m
y
k

నేడే కౌంటింగ్



● అభ్యర్థుల్లో అయోమయం ● అనుచర వర్గాల్లో టెన్షన్ ● జోరుగా బెట్టింగులు ● అభ్యర్థుల భవిష్యత్తు ఈవీఎంలలో

నవతెలంగాణ-లింగంపేట్

ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల్లో అయోమయం నెలకొంది. అనుచరవర్గంలో మాత్రం టెన్షన్ టెన్షన్‌తో ఆందోళన చెందుతున్నారు. మరోవైపు గెలుపోటములపై జోరుగా బెట్టింగులు జరుగుతున్నాయి. ఎవరికి వారే ఎన్నికల్లో గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. అభ్యర్థుల భవిష్యత్తు ఈవీఎంలలో ఉంది. ఆదివారం ఓట్ల లెక్కింపు ఉదయం 8 గంటలకు ప్రారంభం కావడంతో సమయం దగ్గర పడే కొద్ది అభ్యర్థుల వైపు అనుచరులు.. మరోవైపు ఆందోళన చెందుతున్నారు.

ఎల్లారెడ్డి అసెంబ్లీ బరిలో అధికార బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యే జాజాల సురేందర్ పోటీ చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి మదన్ మోహన్‌రావు, భారతీయ జనతా పార్టీ నుండి వడ్డేపల్లి సుభాష్ రెడ్డి, బీఎస్పీ నుంచి జమున రాథోడ్‌తో పాటు పలువురు ఇతరులు పోటీచేశారు. నియోజకవర్గంలో రెండు లక్షల ఇరవై మూడు వేల ఓటర్లకు గానూ నవంబర్ 30న పోలింగ్ జరగడంతో 83వ శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధికార పార్టీ అభ్యర్థి జాజాల సురేందర్ నెలరోజుల పాటు తమదైన శైలిలో ప్రచార నిర్వహించారు. రెండోసారి గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు తిరిగి బీఆర్ఎస్ పార్టీకే పట్టం కడతారని అనుచరులకు భరోసా ఇస్తున్నారు. ప్రభుత్వం మీద వ్యతిరేకత ఉండడంతో వ్యతిరేకతను తమవైపు మలుచుకోవడానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మదన్ మోహన్ రావు ప్రచారంలో వేగం పెంచి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానం ఎండగడుతూ అనుచరులకు అండగా ఉంటూ భరోసా నింపారు. భారత జనతా పార్టీ అభ్యర్థి వడ్డేపల్లి సుభాష్ రెడ్డి ప్రచారంలో చేసిన క్షేత్రస్థాయిలో పార్టీకి సానుకూలత లేకపోవడంతో అంతంతమాత్రాన్ని ప్రచారం చేశారు. ఎల్లారెడ్డిలో అధికార పార్టీ, కాంగ్రెస్ పార్టీల మధ్య ప్రధాన పోటీ నెలకొంది. ఓటర్లను తమ వైపు తిప్పుకోవడానికి బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామస్థాయి నుండి మండల స్థాయి వరకు పోటీపడి ఓటర్లను తమ వైపు తిప్పుకున్నారు. అధికార పార్టీ మూడోసారి హ్యాట్రిక్ సాధిస్తుందని కెసిఆర్ ప్రకటనలు చేసిన ఎగ్జిట్ పోల్స్ హస్తం హవా అని చూపించడంతో ఈవీఎంలలో తమ భవిష్యత్తు ఉందని వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పవనాలు వీచడంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మదన్ మోహన్ రావు గెలిచి తీరుతాడని రాష్ట్రంలో అధికారంలోకి కాంగ్రెస్ పార్టీ వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎవరికి వారే గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నప్పటికి ఈవీఎంలలో భవిష్యత్తు ఉండడంతో ఓటర్ల చేతిలో తమ భవిష్యత్తు ఉందని వారంటున్నారు.

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో నవంబర్ 30 జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రెండు లక్షల ఇరవై వేల 531 ఓటర్ల గాను 272 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో 1,83,414 ఓట్లు పోలయ్యాయి. 83.17 శాతం పోలింగ్ నమోదయింది. ఎన్నికల బరిలో నిలిచిన వివిధ పార్టీల అభ్యర్థులు గెలుపోటములపై ఎవరికి వారే తమ అంచనాలు వేసుకుంటున్నారు.

ఎన్నికల్లో జరిగిన పోలింగ్ వివరాలను పోలింగ్ ఏజెంట్ల ద్వారా తెప్పించుకొని పరిశీలిస్తున్నారు. గ్రామాల వారీగా పోలింగ్ కేంద్రాల వివరాలను తీసుకొని ఎన్ని ఓట్లు వస్తాయో అంచనా వేసుకుంటున్నారు. ఏ మండలాల్లో ఏ గ్రామాల్లో తమకు అనుకూలంగా ఉన్నాయో.. అనుకూలంగా ఎన్ని ఓట్లు పడ్డాయో అంచనాలు వేసుకుంటున్నారు. తమకే మెజార్టీ వస్తుందని ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆదివారం వెల్లడించడంతో కాబోయే ఎమ్మెల్యే ఎవరనేది నేడు తేలనుంది.

గ్రామాల్లో, మండల స్థాయిలో ప్రధాన పార్టీల అభ్యర్థులపై వేల రూపాయల్లో బెట్టింగులు కొనసాగుతున్నాయి. ఏ అభ్యర్థి గెలుస్తారో బెట్టింగ్ పెడుతున్నారు. ఏదిఏమైనా ఆదివారం ఫలితాలు ఎలా ఉంటాయోననే ఆందోళన ఇటు అభ్యర్థుల్లో.. అటు నాయకుల్లో ఉత్కంఠ నెలకొంది.

ముగిసిన ఎన్నికలు.. పనుల్లో మహిళలు

నవతెలంగాణ-బోధన్

20 రోజులపాటు ఎన్నికల ప్రచారంలో తీరిక లేకుండా పాల్గొన్న మహిళలు గురువారం నాటికి ఎన్నికలు ముగియడంతో వారు తమ రోజువారి కూలీ పనులలో బిజీగా మారారు. శనివారం సాలూర మండలం సాలూర క్యాంప్ శివారులో విత్తనాలు వేస్తూ మహిళలు పనిలో నిమగ్నమైన దృశ్యం కంటపడడంతో నవతెలంగాణ క్లిక్ మనిపించింది.



బడి బయట పిల్లలు బడిలో

నవతెలంగాణ-లింగంపేట్

బడి బయట పిల్లవాడిని గుర్తించి బడిలో పాఠశాల ఉపాధ్యాయులు శనివారం చేర్పించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని కోమటిపల్లి గ్రామానికి చెందిన మనుకొండ ఎరుకుల చరణ్ 4వ తరగతి పూర్తవుగానే రికార్డ్ సీటు తీసుకుని వేరే పాఠశాలలో ప్రవేశం పొందకుండా, పాఠశాలకు వెళ్లకుండా, పొలం గట్లపైన, చెరువులెంబడి ఆడుకుంటుంటే ఆ అబ్బాయిని కోమటిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు గుర్తించి విద్యార్థి తల్లిని, తాతను ఒప్పించి వారికి అవగాహన కల్పించారు. కోమటిపల్లి ప్రాథమిక పాఠశాలలోని 5వ తరగతిలో శనివారం చేర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యా బోధన ఉందని, కార్పొరేట్ తరహాలో వసతులు ఉన్నాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను అర్ధాంతరంగా చదువులు మానిపించవద్దని తెలిపారు. ప్రైవేటు పాఠశాలల వైపు వెళ్లకుండా చక్కటి బోధన ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతుందని ఆయన సూచించారు.



ఎన్నికల కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ పూర్తి

● భారీ బందోబస్తు మధ్య ఓట్ల లెక్కింపు ● పర్యవేక్షించిన జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా ఎస్పీ

నవతెలంగాణ-కామారెడ్డి

శాసనసభ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఏర్పాట్లలో భాగంగా కౌంటింగ్ సిబ్బందికి రెండవ విడత యాద్రుచ్చికరణ (ర్యాండమైజేషన్) ప్రక్రియను ఎన్నికల పరిశీలకుల సమక్షంలో పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి పాటిల్ తెలిపారు. శనివారం కలెక్టరెట్‌లోని ఎన్.ఐ.సి హాల్‌లో కౌంటింగ్ పరిశీలకులు చిఫంగ్ ఆర్థర్ వర్చుయో, జగదీశ్, అభయ్ నందకుమార్ కరగుట్కర్ సమక్షంలో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ సెకండ్ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. జిల్లాలోని మూడు శాసభసభ నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ పూర్తయిన మీదట కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఈ.వీ.ఎంలను ఓట్ల లెక్కింపు కోసం కామారెడ్డిలోని ఎ.ఎం.సి గోదాంలో ఏర్పాటు చేసిన నిజామాబాద్ జిల్లా కౌంటింగ్ కేంద్రాలకు తరలించి సాయుధ బలగాల పహారా నడుమ స్ట్రాంగ్‌రూమ్‌లలో భద్రపరిచామన్నారు. ఓట్ల లెక్కింపు కోసం 75 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 54 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 62 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని, రిజర్వు సిబ్బందిని సైతం అందుబాటులో ఉంచామన్నారు. వీరికి ఇప్పటికే పలు విడతలుగా మాస్టర్ ట్రైనర్స్ చే కౌంటింగ్ నిర్వహణపై శిక్షణ ఇచ్చామన్నారు. అనంతరం కౌంటింగ్ కేంద్రాలలో ఏర్పాట్లను కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ సింధు శర్మ పరిశీలించి పోలీసు సిబ్బందికి, కౌంటింగ్ సిబ్బందికి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం ఆదేశాలకు కౌంటింగ్‌కు ఒక్కో టేబుల్ కు ఒక్కో సూక్ష్మ పరిశీలకులు, కౌంటింగ్ సూపరవైజర్, కౌంటింగ్ అసిస్టెంట్ చొప్పున ఏర్పాటు చేశామన్నారు. ప్రతి నియోజకవర్గానికి ఓట్ల లెక్కింపుకై 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేస్తూ, 18 నుండి 20 రౌండ్ల వారీగా కౌంటింగ్ నిర్వహించేలా పకడ్బందీ చర్యలు తీసుకున్నామని అన్నారు. ప్రతి టేబుల్ వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుకై కామారెడ్డి నియోజకవర్గంలో 4 టేబుళ్ళు, జుక్కల్, ఎల్లారెడ్డి నియోజకవర్గాలలో రెండు టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భగా కౌంటింగ్ నిర్వహణపై ఓట్ల లెక్కింపు సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో పలు సూచనలు చేసినట్లు ఆయన తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి

మూడవ విడత కౌంటింగ్ సిబ్బంది రాండమైజేషన్ ప్రక్రియ ఆదివారం ఉదయం 5గంటలకు రిటర్నింగ్ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తారని కలెక్టర్ తెలిపారు. ఆ జాబితాను అనుసరిస్తూ కౌంటింగ్ సిబ్బందిని ఆయా టేబుళ్లకు ఓట్ల లెక్కింపు కోసం కేటాయిస్తామని అన్నారు. అంబులెన్స్, అగ్నిమాపక వాహనాన్ని ముందస్తుగా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు మను చౌదరి, శ్రీనివాస్ రెడ్డి, మన్నరు ప్రభాకెట్, సిపిఒ రాజారామ్, రఘునందన్, దయానంద్, సతీష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తాగడం.. పడటం..

● మద్యం ప్రియులకు పరిపాటిగా మారిన వైనం
● వైన్స్‌ల వద్ద నిబంధనలు పాటించని యజమానులు
● పట్టించుకోని ఆబ్కారీ అధికారులు

నవతెలంగాణ-వర్ని

మందుబాబులు వైన్స్ వద్దనే మద్యం సేవించడం.. అక్కడే పడిపోవటం పరిపాటిగా మారింది. వైన్స్ యజమానులు నిబంధనలు పాటించడం లేదు. దీనికి తోడు ఆబ్కారీ అధికారులు సైతం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు.

చందూర్ మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పక్కన గల వైన్స్ వద్ద ఫుల్లుగా మద్యం సేవించి.. అదే మత్తులో రోడ్డు పక్కనే పడుకున్నాడు. నిత్యం వందల సంఖ్యలో ఈ రోడ్డు గుండా వాహనాలు ప్రయాణిస్తుంటాయి. రోడ్డు పక్కనే పడుకోవడంతో ఏదైనా అనుకోని ఘటన జరిగితే బాధ్యులెవరని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



నిబంధనలు తూచ్..

వైన్స్ షాపుల్లో కేవలం మద్యం మాత్రమే విక్రయించాల్సి ఉండగా.. ఆ యజమానులు మాత్రం మద్యంతో పాటు.. చిరు తిను బండారాలు, వాటర్, తాగే వారికి ఆశ్రయం కల్పించడంతో ఇలా మద్యం ప్రియులు ఇష్టానుసారంగా మద్యం సేవించి రోడ్ల పక్కనే నిద్రిస్తున్నారు. అధికారులు స్పందించి నిబంధనలు పాటించని వైన్స్ యజమానులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.